## మాడల్ ఆసుపత్రిగా మార్చుకుందాం:ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

### రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ప్రారంభం

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 10 ప్రభాతవార్త :** రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం రూ. 10 లక్షలకు పెంచుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలలో ప్రధాన గ్యారంటీ పథకం అని యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం పాల్గొని రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించి ప్రసంగించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రారంభించిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కిందచాలా మందికి మేలు జరిగిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సంక్షేమం కోసం నిరంతరం పని చేసేందుకు సిద్ధంగా ఉందని అందుకే ఇప్పుడు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పది లక్షల రూపాయల వరకు పేదలకు ఉచిత వైద్యం అందించబడుతుందని ఆయన చెప్పారు. ఆసుపత్రిలో పరిశుభ్రత పాటించాలని, రోగులతో సన్నిహితంగా మెలుగుతూ, వారికి సరైన న్యాయం చేయాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆసుపత్రి కమిటి సమావేశం ఏర్పాటు చేసి అన్ని రకాల విషయాలపై దృష్టిపెట్టి ఆసుపత్రికి పేరు తీసుకొద్దామని ఆయన చెప్పారు. మనం కష్టపడి ఈ ఆసుపత్రిని మాడల్ ఆసుపత్రిగా మార్చుకుందామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ రాంకిషన్, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డా. స్వప్న, డిఎంహెచ్‌ఓ డా. కృష్ణ, ఆర్డీఓ అనిల్‌కుమార్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్ ఆరోగ్యశ్రీ పథక పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్



వార్త

నాగర్‌కర్నూల్ /వనపర్తి /జోగుళాంబ గద్వాల/నారాయణపేట

## ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని సన్మానించిన నాయకులు

**వెల్దండ, డిసెంబర్ 10 ప్రభాతవార్త:** నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్, కిసాన్‌సెల్ అధ్యక్షులు పర్వత్‌రెడ్డి, సింగిల్‌విండో వైస్ ఛైర్మన్ సంజీవ్‌కుమార్‌యాదవ్, జీయాగూడ యాదవ సంఘం అధ్యక్షులు జక్కుల చిన్న జంగయ్య యాదవ్‌లు శాలువాలతో ఘనంగా సన్మానించి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.



కసిరెడ్డి నారాయణరెడ్డి నాయకత్వంలో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, నియోజకవర్గంలో అసంతృప్తిగా మిగిలిపోయిన పనులన్ని వెంటనే పూర్తి చేస్తారన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 6 గ్యారెంటీల్లోని 2 పథకాలను ప్రారంభించారన్నారు. అదే విధంగా రాచూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో అలీ, ఉప సర్పంచ్‌లు రామకృష్ణ, గోరటి శ్రీనివాస్, శంకర్‌నాయక్, రవీందర్‌రావు, పుల్లయ్య, శ్రీనివాస్‌యాదవ్, రామస్వామి, గోపాల్‌నాయక్, నెంట రాజుతో పాటు తదితరులు ఉన్నారు.

## వైద్య సహాయాన్ని 10 లక్షలకు పెంచిన కాంగ్రెస్ ప్రభుత్వం..

### జెండా ఊపి పథకాలను ప్రారంభించిన జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ సరితమ్మ

**గద్వాల ప్రతినిధి డిసెంబర్ 10 ప్రభాతవార్త:** గద్వాల పట్టణంలోని 24వ వార్డులో మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి పేద కుటుంబానికి ఆసుపత్రిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 10 లక్షల బీమా పథకాన్ని ప్రారంభోత్సవంలో వయస్సుతో భేదం లేకుండా ప్రతి ఒక్కమహిళ ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం చేయవచ్చని జోగులాంబ గద్వాల జిల్లా పరిషత్ చైర్మన్ సరితమ్మ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 24వ వార్డులోని బస్తీ



దవాఖానలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కాంగ్రెస్ పార్టీ తాలూకా ఇంచార్జీ సరితమ్మ కలిసి తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలలో మొదటి పథకం మహాలక్ష్మీ, చేయూత పథకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సరితమ్మ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలలో మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఇందులో మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పిస్తారని, వయస్సుతో భేదం లేకుండా ప్రతి ఒక్క మహిళ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి కుటుంబానికి రూ.10లక్షలతో ఆరోగ్యశ్రీ ద్వారా సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులలో వైద్యసేవలు అందుతాయని తెలిపారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులలో మహిళలు ప్రయాణించవచ్చని జెడ్పిచైర్‌పర్సన్ సరితమ్మ తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని జెడ్పి చైర్‌పర్సన్ సరితమ్మ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో మాజీ ఉమ్మడి పాలమూరు జిల్లా జెడ్పి చైర్మన్ బండారిభాస్కర్, గంజిపేట్ శంకర్, బండ్ల చంద్రశేఖర్ రెడ్డి, ఓబిసి జిల్లా అధ్యక్షుడు నల్లారెడ్డి, మధుసూదన్ బాబు, బండ్ల రాజశేఖర్ రెడ్డి, కౌన్సిలర్లు, వసీమ బేగం, ఇసాక్, కబీర్ దాస్, అనిత,



నరసింహులు, కోఆప్షన్ మెంబర్ మరియమ్మ, తిమోతి, ఎల్లప్ప, నాగేంద్రయాదవ్, పులిపాటి వెంకటేశ్, భాస్కర్ యాదవ్, అన్వర్, అత్తీయ, మోహన్ యాదవ్, గోపాల్, గట్టు శ్రీనాథ్, గడ్డం శ్రీను, మాల శ్రీనివాసులు, కరాటే సత్యం, నాగశంకర్, జమల్, ఎస్పీ దేవరాజు, భాస్కర్‌రెడ్డి, మోహిన్, ఆనంద్ గౌడ్, గోపాల్ వర్మ, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

## వారం రోజుల్లో అక్రమాలపై విచారణ చేపట్టాలి..

### ఆర్టీసీని ఏ విధంగా రక్షిస్తారో ప్రజలకు చెప్పాలి

### మీడియా సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి, మిథున్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 10 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పాలన ప్రారంభించిన మొదటి రోజునే దివ్యాంగురాలికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని చెప్పి ఒప్పంద ఉద్యోగం ఇచ్చి తనను అవమానించారని బిజెపి పాలమూరు జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి అన్నారు. ప్రగతి భవన్ కంచెలు తీసేసి ప్రజల సమస్యలు తీరుస్తానని ఒక్కసమస్య కూడా పరిష్కరించలేదని అన్నారు. ఆర్టీసి ఇప్పటికే నష్టాల్లో ఉండగా ఉచిత హామీ వల్ల రోజు కోట్లల్లో నష్టం భరించాల్సి వస్తుందన్నారు. ఉద్యమ సమయంలోని కేసులే కాకుండా భారాసా అక్రమాలను ప్రశ్నించిన వారిపై బనాయించిన అక్రమ కేసులు కూడా ఎత్తివేయాలన్నారు. గత పాలకులచే కబ్జా కాబడ్డ ప్రభుత్వ ప్రైవేట్ భూములను వారి కబంధ హస్తాల నుండి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. డబుల్‌బెడ్ రూముల అక్రమాల విషయంలో ప్రత్యేక అధికారిని నియమించి విచారణ చేపట్టాలన్నారు. వారం రోజుల్లో అక్రమాలపై ఎమ్మెల్యే విచారణ ప్రారంభించకపోతే భాజపా పోరుబాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం బిజెపి నేత మిథున్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజల్ని ఇబ్బంది పెట్టడం వల్లే ప్రజానీకం మార్పును ఆహ్వానించారని ఆరు గ్యారంటీలను ఏ విధంగా అమలు పరుస్తారో స్పష్టం చేయాలన్నారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా పద్మావతి కాలనీలో గల నా కార్యాలయంలో 24 గంటలపాటు సంప్రదించవచ్చని వారి సమస్యల పరిష్కారం కోసం ఖచ్చితంగా పోరాటం చేస్తానన్నారు. తన వ్యకిగత ఫోన్ నంబర్ 9989040123 కూడా ప్రజలు ఎప్పుడు సంప్రదించిన అందుబాటులో ఉంటానని భరోసానిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, పడగల బాలరాజు, జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణవర్ధన్‌రెడ్డి, పి.సత్యం, బుచ్చిరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అచ్చిగట్ల అంజయ్య, ఓబిసి మచ్చ జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ యాదవ్, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా మీడియా సెల్ కన్వీనర్ కె.సతీష్‌కుమార్, పట్టణ అధ్యక్షులు నారాయణ యాదవ్, మండల అధ్యక్షులు రాజుగౌడ్, వెంకటయ్య పాల్గొన్నారు.



## శక్తి పీఠాన్ని దర్శించుకున్న ఎస్పీ

**గద్వాల ప్రతినిధి డిసెంబర్ 10 ప్రభాతవార్త :** ఐదవ శక్తిపీఠమైన అలంపూర్ జోగులాంబ అమ్మవారిని ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి బాల బ్రహ్మేశ్వర స్వామికి అభిషేకం చేయించి జోగులాంబ అమ్మవారికి కుంకుమార్చన చేయించి ప్రత్యేక పూజలు నిర్వహించి శేష వస్త్రాలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ ఎస్సై రమేష్ దేవాలయ సీనియర్ అసిస్టెంట్ శేఖర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# మహిళలకు సీఎం కానుక మహాలక్ష్మి పథకం..!

### సంక్రాంతి నుంచి కొత్త బస్సులు ప్రారంభం.. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి..

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 10 ప్రభాతవార్త :** ప్రజాప్రభుత్వం అంటే ఏమిటో రెండు రోజుల్లోనే రాష్ట్ర ముఖ్యమంత్రి నిరూపించారని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే ఎన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేయ తలపెట్టి ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలలో రెండు గ్యారంటీలైన మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలను ఆయన ఆదివారం మహబూబ్‌నగర్‌లో ప్రారంభించారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలందరికీ రాష్ట్ర ఆర్టీసి బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ఆయన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని నూతన బస్టాండ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రగతి భవన్ గడీలను బద్దలు కొట్టిన ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు రెండు రోజుల్లోనే మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయడం జరిగిందని, ఆర్టీసి బస్సులలో మహిళలందరూ ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని కల్పించామని తెలిపారు. మహాలక్ష్మి పథకం పట్ల మహిళలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని, తాను మహాలక్ష్మి పథకం ప్రారంభించి బస్సులో కూర్చున్న సందర్భంలో ఇంజనీరింగ్ చదివే అమ్మాయి ప్రతిరోజు మహబూబ్‌నగర్ నుండి హైదరాబాద్‌కు ఛార్జీ చెల్లించి బస్సులో వెళ్లేదని, అలాంటిది ప్రభుత్వం తీసుకువచ్చిన మహాలక్ష్మి మహిళల ఉచిత ఆర్‌టిసి ప్రయాణ పథకం కారణంగా తాను ఉచితంగా బస్సులో వెళ్లేందుకు అవకాశం కలిగిందని సంతోషం వ్యక్తం చేసిందని తెలిపారు. అంతేకాక మరో మహిళ వారి కుటుంబ సభ్యులలో ఒకరికి క్యాన్సర్ చికిత్స నిమిత్తం వారంలో రెండుసార్లు హైదరాబాద్ వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, మహాలక్ష్మి పథకం రావటం వల్ల పైసా ఖర్చు లేకుండా బస్సులో ఉచితంగా ప్రయాణం చేసి వారికి సేవ అందించే అవకాశం కలిగిందని ఎంతో ఉద్వేగ భరితంగా చెబుతున్నారని పేర్కొన్నారు. మహిళలందరికి ఎంతో ఉపయోగపడే ఈ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రాబోయే రోజుల్లో మహాలక్ష్మిపథకం కింద 1000 కొత్త బస్సులు ఏర్పాటు చేసే ఆలోచనలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఉన్నారని, సంక్రాంతి నాటికి కొత్త బస్సులతో ఏర్పాటు చేయడం జరుగుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇది మహిళలకు ఇచ్చిన కానుక అని తెలిపారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీదేవి, డిఎం సుజాత, ఆర్డీఓ అనిల్‌కుమార్, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఉచిత ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి



బస్సును ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి



ప్రయాణీకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

# ముదురుతున్న సోషల్ వార్..?

### విమర్శలు,ప్రతివిమర్శలతో హోరెత్తుతున్న పోస్టులు వ్యక్తిగత దూషణలకు దిగుతున్న వైనం వనపర్తిలో యుద్ధ వాతావరణం

**వనపర్తి,డిసెంబర్ 10,ప్రభాతవార్త:** అసెంబ్లీ ఎన్నికలు ముగిసినప్పటికీ వనపర్తిలో మాత్రం సోషల్‌మీడియా వార్ సద్దుమణగలేదు.ఒక పార్టీ కార్యకర్తలు.మరో పార్టీ నాయకుల పై పోస్టులు పెడుతుండడం,దూషణలు చేయడంతో వనపర్తిలో శాంతి యుత వాతావరణానికి భంగం వాటిల్లుతుంది.ఒక్కో సోషల్ మీడియా గ్రూపులో రోజుకు 200పోస్టుల వరకు విమర్శ,ప్రతి విమర్శలతో దాడి చేసుకుంటున్నారు.రాత్రి పొద్దుపోయే వరకు ఒకరి పై ఒకరు నిందలు,ప్రతినిందలతో ఫోన్‌లలో కొట్టుకున్నంత చేస్తున్నారు.ఇప్పుడు మీ పార్టీ అధికారంలోకి వచ్చింది కదా.. మీరేంతా చేస్తారో చూద్దామంటూ పోస్టు పెడితే..సందట్లో సడేమి యాలాగా మూడో వ్యక్తి ప్రవేశించి మీరెండు పార్టీలు ప్రజలకు కొత్తవేమీ కాదు అంటూ వ్యంగ్యంగా పోస్టులు పెడుతున్నారు. అదే గ్రూపులో ఉంటున్న ఏపార్టీలకు చెందనివారు మాత్రం.అరే ఇదేం లొల్లి బై.మీ పార్టీలోళ్లతోని తలనొప్పిగా మారింది.అంటూ విసుక్కుంటున్నారు,ఎన్నికల సమయంలో ఎంత చర్చ పెట్టినా అందరూ ఎంజాయ్ చేశారు.అభివృద్ధి,విమర్శల పై చర్చించా రు.కానీ ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా సోష ల్‌వార్ తగ్గకపోవడం పై సామాన్యులు తలలు పట్టుకుం టున్నారు.

**బహిరంగ విమర్శలు..**

వనపర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు బహిరంగంగా విమర్శిస్తుండడం గొడవలకు దారి తీస్తోంది.గతంలో ప్రజా సమస్యల పై ప్రశ్నించే నాయకులు ప్రస్తుతం వ్యక్తిగత దూషణలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.వనపర్తి అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ నుంచి మాజి మంత్రి.నిరంజన్ రెడ్డి,కాంగ్రెస్ నుంచి పెద్ద మందడి ఎంపీపీ మేఘా రెడ్డి పోటీ పడ్డారు.ఈ ఎన్నికల్లో మేఘా రెడ్డి 25 వేల మెజార్టీతో గెలుపొందారు.ఎన్నికలు ముగిశాయి.అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు మాత్రం మానడం లేదు.వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రచ్చ జరుగుతుంది.క్యాంపు కార్యాలయంలో ఉన్న రేకుల షెడ్డు, పర్నిచర్ వస్తువులను మాజి మంత్రి.నిరంజన్ రెడ్డి తీసుకెళ్లాడని కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేశారు.మీడియా సమావేశంలో వ్యక్తిగత దూషణలు చేసుకున్నారు.



మాజి మంత్రిపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేశారంటూ పిర్యాదు చేస్తున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు

**ఒకరికొకరు పోలీసులకు పిర్యాదులు..**

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం రచ్చ ఇరువురు నాయకులు పోలీస్ స్టేషన్ లో పిర్యాదులు చేసుకునే స్థాయికి చేరుకుంది.ఎమ్మెల్యే కార్యాలయంలో సామాగ్రిని మాజి మంత్రి తీసుకెళ్లాడని వనపర్తి కాంగ్రెస్ నాయకులు పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు. అనంతరం మీడియా ముందు మాజి మంత్రి.నిరంజన్ రెడ్డిని విమర్శలు చేశారు.దీంతో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పై వ్యక్తిగత దూషణలు చేశారని పోలీసులకు పిర్యాదు చేశారు.ఇదిలా ఉండగా ఎన్నికలు ముగిసినప్పటికి సోషల్ మీడియాలో కాంగ్రెస్,బిఆర్ఎస్ పార్టీ నాయకుల విమర్శలు,దూషణలు మాత్రం ఆగడం లేదు.

**వనపర్తిలో సోషల్ వార్..** ఎన్నికల ఫలితాలు వచ్చి వారం రోజులైన వనపర్తిలో మాత్రం సోషల్ వార్ మాత్రం కట్టడి కావడం లేదు.ఎన్నికల్లో గెలుపోటములు సమానం.గతంలో ఎన్నడూ లేని విధంగా ఎమ్మెల్యే అభ్యర్థులపై కూడా దాడులకు దిగుతూ కొత్త సంస్కృతికి తెరలేపుతున్నారు.ఈ నెల 3న వనపర్తి చిట్యాల ఎన్నికల కౌంటింగ్ వద్ద ఫలితాల జరుగుతున్న చివరి క్షణంలో మాజి మంత్రి.నిరంజన్ రెడ్డి మధ్యలోనే బయటికి కాన్వాయ్ లో వస్తుండగా కొందరు కాంగ్రెస్ వ్యక్తులు దాడికి పాల్పడ్డారు.మాజి మంత్రి నిరంజన్ రెడ్డి వాహన అద్దాలను పగలగొట్టారు.దీంతో వ్యక్తులను గుర్తించి వారి పై పోలీసులు కేసులు నమోదు చేశారు.అప్పటి నుంచి వనపర్తిలో సోషల్ మీడియాలో విమర్శలు, దూషణలు యుద్ధ వాతావరణానికి దారితిస్తున్నాయి.ఏది ఏమైనప్పటికీ వనపర్తిలో జరుగుతున్న సోషల్ మీడియా వార్ ను కట్టడి చేయాల్సిన అవసరం ఉందని పలువురు అంటున్నారు.

## మహాలక్ష్మి, ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**నారాయణపేట ప్రతినిధి,డిసెంబరు 10 ప్రభాతవార్త :** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు పథకాలలో మహాలక్ష్మి, ఆరోగ్యశ్రీ పథకాలను ఆదివారం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రారంభించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా డిపో మేనేజర్ లక్ష్మిసుధా, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి సౌభాగ్యలక్ష్మిలు మక్తల్ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన వేదికలో ఎమ్మెల్యే శ్రీహరి పాల్గొన్నారు. అనంతరం రిబ్బన్ కట్‌చేసి మహిళలతో పాటు బస్సులో ప్రయాణించారు. మహిళలకు జీరో ఉచిత బస్ టికెట్లను అందించారు. తెలంగాణలో బాసర నుండి అలంపూర్ వరకు మహిళలు ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించొచ్చని దానితోపాటు దైవదర్శనాలు చేసుకోవచ్చని ఆయన అన్నారు. అంతకు ముందు మహిళా ఇన్సూరెన్స్ పథకాన్ని జిల్లా వైద్యాధికారిని సౌభాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే శ్రీహరి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం వెనుకబడిన వర్గాల వారికి ఇన్సూరెన్స్ పథకాన్ని 10 లక్షలకు పెంచిందని ఈ పథకం ద్వారా అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ కార్పోరేట్ వైద్యం ఉచితంగా పొందవచ్చని అన్నారు. అధికారంలో వచ్చిన వారం రోజులకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీలలో రెండు హామీలను నెరవేర్చిందని మిత హామీలను వంద రోజుల్లో అమలు పరుస్తామని ఆయన అన్నారు.



మహిళలతో పాటు బస్సులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

# అడుగడుగునా నీరాజనాలు...

- వంగూరు నుంచి అచ్చంపేట వరకు భారీ ర్యాలీ...
- నల్లమల్ల ముద్దుబిడ్డ వంశీకృష్ణకు ఘన స్వాగతం
- కార్యకర్తల ప్రశంసల వెల్లువ...

**అచ్చంపేట, డిసెంబర్ 10 ప్రభాతవార్త:** కష్ట నష్టాలను ఓర్చి కష్ట కాలంలో కార్యకర్తలకు అండగా ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేసి జిల్లా స్థాయిలో నేనున్నాననే కార్యకర్తలకు భరోసా కల్పించి పార్టీ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 50వేల పైచిలుకు ఓట్లతో అత్యధిక మెజార్టీతో గెలుపొందిన అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణకు అడుగడుగునా నీరాజనాలు పలికారు. ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేసి మొదటి సారిగా నియోజకవర్గానికి వచ్చిన సందర్భంగా అచ్చంపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సంతోషాలకు అవధులు లేవు. ఆదివారం అచ్చంపేట నియోజకవర్గం వంగూరు మండలంలోని శ్రీశైలం ఎక్స్ రోడ్డు నుంచి మొదటి పెడితే అచ్చంపేట నడిబొడ్డు వరకు కార్యకర్తలు, నాయకులు బైక్ ర్యాలీగా వెళ్తూ స్వాగతం పలికారు. వంగూరు గేటుపై ఎంపీటీసీ రమేష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పండిత్‌రావు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు శివశంకర్ తమ కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణకు ఘన స్వాగతం పలికి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కోనేటిపూర్, తిరుమలగిరి గ్రామాల్లో ఆయా గ్రామాలకు సంబంధించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్మానించి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా మాజీ ఎంపీ మల్లురవి, జెడ్పీటీసీ కేవీఎన్‌రెడ్డి, వంగూరు మండల ప్రచార కమిటీ చైర్మన్ పాండురంగారెడ్డి, నారాయణరెడ్డిలు కార్యకర్తల ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా డిండి మండల కేంద్రంలో బాణసంచా పేల్చి ఘన స్వాగతం పలికారు. ఈ అనంతరం కేక్‌ను కట్ చేసి శాలువా, పూలమాలలతో సన్మానించి హర్థిక శుభాకాంక్షలు తెలిపారు. అచ్చంపేటలో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీకి నియోజకవర్గంలోని వంగూరు, చారకొండ, ఉప్పునుంతల, బల్మూర్, లింగాల, అమ్రాబాద్,పదర, అచ్చంపేట మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలివచ్చి లింగాల చౌరస్తాలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియం నుంచి లింగాల చౌరస్తా వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. 15 సంవత్సరాల కల నేరవేరిందన్న ఆశతో కార్యకర్తల కోలాహలం అంబరాన్నంటాయి. అచ్చంపేట పట్టణంలో వంశీకృష్ణకు స్వాగతం పలికేందుకు భారీ ఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.



డాక్టర్ ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణను సన్మానిస్తున్న మాజీ ఎంపీ మల్లురవి



డాక్టర్ ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణను సన్మానిస్తున్న వంగూరు మండల నాయకులు





విజయోత్సవ ర్యాలీలో కాంగ్రెస్‌శ్రేణులు

## నేడు విజయోత్సవ ర్యాలీ..



**కల్వకుర్తి, డిసెంబర్ 10, ప్రభాతవార్త:**ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా కసిరెడ్డి నారాయణరెడ్డి విజయం సాధించారు. శనివారం అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత సోమవారం మొదటి సారి తన స్వంత నియోజకవర్గానికి రానున్న సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చి విజయోత్సవ ర్యాలీని నిర్వహించనున్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని కడ్తాల్, ఆమనగల్లు, వెల్దండ మీదుగా విజయోత్సవ ర్యాలీ కల్వకుర్తి పట్టణానికి చేరుకుంటుందని, కల్వకుర్తికి చేరుకునే విజయోత్సవ ర్యాలీకి స్వాగతం పలికేందుకు కల్వకుర్తి పట్టణ కాంగ్రెస్ నాయకులు గచ్చిబావి నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ తెలిపారు. తలకొండపల్లి, మాడ్గుల మండలాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు కడ్తాల్‌కు చేరుకొని విజయోత్సవ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## హాజ్‌కి వెళ్తున్న మహమ్మద్ సుల్తాన్‌కు సన్మానం

**కొత్తకోట, డిసెంబర్ 10, ప్రభాతవార్త :** కొత్తకోట పట్టణ కేంద్రానికి చెందిన సుల్తాన్ హజ్ యాత్రకు వెళ్తున్న సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ నాయకులు మాజీ జెడ్పిటిసి పి జై బాబు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ఎన్ జే బోయోజ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోతుపల్లి శ్రీనివాస్ మండల మైనార్టీ సెల్ నాయకుడు సలీం ఖాన్, ముస్లిం మైనార్టీ పెద్దలు సుల్తాన్ స్వగృహంలో పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవితంలో ఒక్కసారైనా హాజ్ (మక్కా)వెళ్లాలన్నది ప్రతి ముస్లిం జీవిత ఆశయమని అది మహమ్మద్ సుల్తాన్ కళ నెరవేరుతోందని అన్నారు. పవిత్ర మక్కాను సందర్శించి అందరి బాగుకోసం ప్రార్థించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి మోహన్ రెడ్డి, వనపర్తి కృష్ణారెడ్డి, కే గోవిందరెడ్డి, బెన్నీ, ఖలీల్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వం చేతల ప్రభుత్వం..

### కాంగ్రెస్ మహిళా మండల అధ్యక్షురాలు సుకన్య రెడ్డి



**వీపనగండ్ల, డిసెంబర్ 11, ప్రభాతవార్త :** వవీపనగండ్ల మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు సుకన్య రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాల్లో ఆరు గ్యారెంటీ పథకాలలో ఒకటైన మహాలక్ష్మీ పథకం భాగంగా మహిళలకు తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ పథకం ప్రారంభించడం హర్షనీయమని అన్నారు. వారు మాట్లాడుతూ ఉచిత ఆర్టీసీ బస్సు పథకం ద్వారా ప్రభుత్వానికి మూడు వేల కోట్ల రూపాయల అదనపు భారం పడిన, ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానం మేరకు ఆదివారం ఉచిగ ఆర్టీసీ బస్సు ప్రయాణం కార్యక్రమం చేపట్టడం మహిళలకు ఎంతో మేలు చేకూరుస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చి చేతుల ప్రభుత్వమని వారు అన్నారు.

## పూర్వ విద్యార్థుల కలయిక



**ఉప్పునుంతల, డిసెంబరు 10 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 1992 చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం యశోద ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యనందించిన గురువులు బద్రినారాయణ, విశ్వనాథం, కాశన్నలను పూర్వ విద్యార్థులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు జయపాల్‌రెడ్డి, సీమర్ల బుచ్చిరెడ్డి, మేకల రామచంద్రయ్య, తిరుపతయ్య, రాగి పరమేశ్వర్‌రెడ్డి, నామని తిరుపతయ్య, పాపిశెట్టి మధు, పాపిశెట్టి కిషన్, తేనేటి కృష్ణారెడ్డి, జంపుల రాంబాబు, జ్యోతి, భాగ్యలక్ష్మి, పెద్దిరెడ్డి సునిత, రాజునాయక్, బాలపీరు, తిప్పర్తి దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య ఆధ్వర్యంలో ఘనంగా వనభోజన కార్యక్రమాలు



**మిడ్జిల్, డిసెంబరు 10 ప్రభాతవార్త :** ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు ఎన్ఎం సత్యనారాయణ గుప్తా ఆధ్వర్యంలో వన భోజన కార్య క్రమాన్ని ఘనంగా నిర్వహించా రు. ఉసిరి వృక్షానికి పూజ నిర్వహించి అమ్మవారికి అమ్మవా రికి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం కోలాటం ఆటపాట లతో సంస్కృతి కార్యక్రమాలను నిర్వహించారు. ఆర్యవైశ్య సం ఘం మండల అధ్యక్షుడు సత్య నారాయణ గుప్త మాట్లాడుతూ ప్రతిఏటా ఈ వనభోజన కార్య క్రమాలను ఆనవాయితీగా వస్తుందని వృక్షానికి పూజచేసి అమ్మవారిని దర్శించుకోవడం అమ్మవారి దీవెనలు మెండుగా ఉండాలని తెలిపారు. ఈ వన భోజన కార్యక్రమానికి ఊరుకొండ మండల ఆర్యవైశ్యులు, మండల ప్రధాన కార్యదర్శి కంచె కృష్ణయ్య గుప్తా కోశాధికారి జులారి యాదయ్య గుప్తా, విజయకుమార్, భాస్కర్‌గుప్తా, శ్రీను గుప్తా, బాలస్వామి గుప్తా, ఎర్రం రమేష్‌గుప్తా, మహేష్‌గుప్తా, వీణలహరి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన సిసి రోడ్డుపైనే మురుగునీరు..

### ఇబ్బందుల్లో గ్రామస్తులు ప్రయాణీకులు



**ఉండవెల్లి, డిసెంబరు 10 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కంచుపాడు గ్రామంలో ప్రధాన సిసి రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తుండడంతో గ్రామస్తులు, వాహనదా రులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సిసి రోడ్డు మీదుగా నిత్యం ప్రయాణీకులు ద్విచక్ర వాహనాలపై, ఆటోలపై ప్రయాణం సాగిస్తుంటారు. కనీసం మనుషులు నడవడా నికి కూడా ఇబ్బందికరంగా ఉండడంతో ఇక్కడ వాహనాలు అదుపు తప్పుతుండడంతో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపో తున్నారు. సిసి రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ లేకపోవడం వల్ల ఇళ్లనుంచి వచ్చే మురుగు నీరు పారుతుండడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సిసి రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉండడంతో దోమల వల్ల రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి వెంటనే డ్రైనేజీ నిర్మాణం చేపట్టి మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పాదయాత్ర యువకులకు స్వాగతం పలికిన సర్పంచ్..



**ఇటిక్యాల, డిసెంబరు10 ప్రభాతవార్త:**ఉమ్మడి మహబూబ్‌నగర్‌జిల్లా కొడంగల్‌నియోజకవర్గం నుండి రాష్ట్ర పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి భారీ మెజార్టితో ఎమ్మెల్యేగా గెలిపించి ఈనెల 7న తెలంగాణ ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా కొడంగల్ నియోజకవర్గానికి చెందిన నాగరాజు, రఘుపతి అనే ఇద్దరు యువకులు కొడంగల్ నుండి తిరుమల తిరుపతి వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నారు. పాదయాత్ర ఇటిక్యాల ఎర్రవల్లి చౌరస్తాకు చేరుకోగా స్థానిక సర్పంచ్ జోగులరవి, ఉపసర్పంచ్ పద్మ వెంకటన్న, రాంప్రసాద్, శివ వారికి స్వాగతం పలి కారు. పాదయాత్రగా తిరుపతికి వెళుతుండగా వారికి పండ్లు, తాగునీరు అందజేసి వారిని అభినందించారు.

# మన్యంకొండలో కన్నులపండువలా తిరుచ్చిసేవ..!

### - అలంకరణలో శ్రీదేవిభూధేవి సమేతంగా స్వామివారి దర్శనం

**దేవరకద్ర, డిసెంబరు 10 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న మన్యంకొండ శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు తిరుచ్చిసేవపై స్వామివారిని ఊరేగించారు. ప్రతి శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ కార్యక్రమాన్ని సాంప్రదాయరీతిలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా దేవస్థానం గర్భగుడి నుండి దేవస్థానం ముందున్న రథ మండపం వరకు శ్రీదేవి భూధేవి సమేతంగా స్వామివారి తిరుచ్చిసేవను నిర్వహించారు. పురోహితుల వేధమంత్రాలు, భక్తుల హరినామశ్చరణ, కాగడాల వెలుతురులో స్వామివారి సేవ ముందుకు కదిలింది. ఈ సేవను చూసి భక్తులు భక్తిపారవశ్యంతో పులకరించిపోయారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, తదితర పూజలను నిర్వహించారు. అనంతరం స్వామి వారిని మళ్ళి గర్భగుడిలోకి తీసుకెళ్లారు. అక్కడ వివిద పూజలను నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

**అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారు..**

మన్యంకొండలో తిరుచ్చిసేవ సందర్భంగా స్వామి వారు తిరుచ్చిసేవపై శ్రీదేవిభూధేవి సమేతంగా ఊరేగుతూ అలంకరణలో భక్తకోటికి దర్శనమిచ్చారు. రకరకాల పూలు, బంగారు ఆభరణాలతో స్వామివారిని అలంకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి భక్తులు మన్యంకొండకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేష్, నరసింహ్మయ్య, పాలకమండలి సభ్యులు, పర్యవేక్షకుడు నిత్యానందచారి, సిబ్బంది సుదర్శన్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి హారతి ఇస్తున్న చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్





మన్యంకొండలో స్వామి వారి తిరుచ్చిసేవ నిర్వహిస్తున్న అర్చకులు

## ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష...

### - ప్రభుత్వ పరీక్షల నిర్వహణాధికారి రాజశేఖర్‌రావు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 10 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూలులో ఆదివారం నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) రాతపరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30వరకు పరీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో నమోదు చేసుకున్న మొత్తం 649 మందికి గాను 614 మంది విద్యార్థులు హాజరు కాగా, 35 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ హైస్కూల్ మూడు పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ పరీక్షల నిర్వహణాధికారి రాజశేఖర్‌రావు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పరీక్షల నిర్వహణాధికారి రాజశేఖర్‌రావు మాట్లాడుతూ ఎన్ఎంఎంఎస్ పరీక్షలను పకడ్బందిగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు చెప్పారు. ఈ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతి సంవత్సరం రూ.12వేల వరకు ఐదు సంవత్సరాల పాటు ఉన్నత చదువులకు స్కాలర్‌షిప్ అందనున్నట్లు ఆయన తెలిపారు.



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

## ఆసుపత్రికి అంబులెన్స్ ఇవ్వండి ప్రాణాలు కాపాడండి..






వీపనగండ్ల మండల సామాజిక ఆరోగ్య కేంద్రం

**వీపనగండ్ల, డిసెంబర్ 11, ప్రభాతవార్త :** వీపనగండ్ల మండల కేంద్రంలోని 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అంబులెన్స్ ఏర్పాటు చేయాలని వీపనగండ్ల మండల ప్రజలు ప్రభుత్వానికి పత్రికా ముఖంగా విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజలు మాట్లాడుతూ మండల కేంద్రంలోని 30 పడకల ఆసుపత్రికి ఇప్పటివరకు స్థిరమైన అంబులెన్స్‌ని ఏర్పాటు చేయకపోవడం వలన అత్యవసర చికిత్స రోగులు ప్రాణాపాయ స్థితి బారినపడి ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొల్లాపూర్ ఎమ్మెల్యే మంత్రి అయిన జూపల్లి కృష్ణారావు మా బాధలను అర్థం చేసుకొని ఆసుపత్రికి అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. రాత్రిపూట అత్యవసర ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు ప్రైవేట్ వాహనాల మీద ఆధార పడవలసి వస్తుందని ప్రైవేటు వాహనాలు కూడా సరైన సమయానికి రాకపోయేసరికి ప్రాణాపాయం జరుగుతుందని అనుకుంటున్నారు. గత ప్రభుత్వంలో ఎన్ని సార్లు విన్నవించుకున్న అంబులెన్స్‌ని ఏర్పాటు చేయలేకపోయారని కాంగ్రెస్ ప్రభుత్వంలో అయినా మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అంబులెన్స్ ఏర్పాటు చేస్తారని ఆశిస్తున్నామని ప్రజలు అనుకుంటున్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డికి జెడ్పీటీసీ కేవీఎన్‌రెడ్డి హర్ధిక శుభాకాంక్షలు

**వంగూరు, డిసెంబర్ 10 ప్రభాతవార్త:**రాష్ట్ర ముఖ్యమంత్రి వంగూరు మండల ముద్దుబిడ్డ ఎనుముల రేవంత్‌రెడ్డిని ఆదివారం హైదరాబాద్ నగరంలో సీఎం కేసీఆర్ నివాసంలో వంగూరు జెడ్పీటీసీ కేవీఎన్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించి హర్ధిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ కేవీఎన్‌రెడ్డి మాట్లాడుతూ అచ్చంపేట నియోజకవర్గం వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామ బిడ్డ ముఖ్యమంత్రి కావడం చాలా సంతోషకరమని ఆయన పేర్కొన్నారు. మా ప్రాంత వాసి రాష్ట్ర ముఖ్యమంత్రి కాదు.. అచ్చంపేట నియోజకవర్గ అభివృద్ధితో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పరిచి పుట్టిన గడ్డకు పేరు, ప్రఖ్యాతలు తీసుకొని వస్తారని ఆయన అన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల కష్ట సుఖాలెంటో తెలిసిన వ్యక్తి సీఎం రేవంత్‌రెడ్డి అని, పేద ప్రజల ఆకలి తీర్చడానికి ఎప్పుడు ముందుంటారని, అలాంటి వ్యక్తి సీఎం కావడం మా మండల ప్రజల అదృష్టమని ఆయన పేర్కొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి జెడ్పీటీసీ కేవీఎన్‌రెడ్డి

## మంత్రిగా బాధ్యత చేపట్టిన జూపల్లి కృష్ణారావు శుభాకాంక్షలు

### మాజీ రైతుబంధు సమితి సమన్వయ అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య



అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య

**వీపనగండ్ల, డిసెంబర్ 11, ప్రభాతవార్త :** ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ, పర్యాటక శాఖ మంత్రిగా బాధ్యతలు చేయబడుతున్న జూపల్లి కృష్ణారావుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్టుగా ఎత్తం కృష్ణయ్య తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూపల్లి కృష్ణరావు పదవి కాంక్షతో ఎప్పుడు పనిచేయలేదని తెలంగాణ ఉద్యమం కోసం మంత్రి పదవిని త్యాగం చేసిన వ్యక్తి అని, రైతుల కోసం జైలుకు వెళ్లి నిరాహార దీక్ష చేసిన గొప్ప నాయకుడని తెలియజేశారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని వీపనగండ్ల మండల కేంద్ర పరిధిలోని పలు గ్రామాలలో ఉన్న సమస్యలను గత బిఆర్ఎస్ ప్రభుత్వం తీర్చలేక పోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వంలో మండల కేంద్రంలో సహా అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తారని తెలియజేశారు. అదేవిధంగా అసెంబ్లీ ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాల ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలలో అధికారం చేపట్టిన రెండు రోజుల్లోనే రైతు బీమా మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించిందని తెలియజేశారు. అధికారం చేపట్టిన 100 రోజుల లోపు మిగతా గ్యారెంటీ పథకాలను అమలు చేస్తారని తెలియజేశారు.

## ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రత్యేక పూజలు..

### నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థనలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు10 ప్రభాతవార్త:**ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత శాసనసభలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలిసారి జడ్చర్ల నియోజకవర్గం చేరుకున్న ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి ఆయా మండల కేంద్రాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలానగర్ మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి అనంతరం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తదనంతరం జడ్చర్ల మండల కేంద్రంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో పార్టీ శ్రేణులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండేలా చూడాలని ప్రార్థనలు చేశారు. ఐదేళ్లు ఏ ఆటంకాలు రాకుండా ప్రజలకు సేవ చేసేందుకు తనకు శక్తి సామర్థ్యాలు ప్రసాదించాలని వేడుకున్నారు. పూజా కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులతోపాటు జడ్చర్ల పట్టణ నాయకులు పాల్గొన్నారు.



అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో ఎమ్మెల్యే

## ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ప్రారంభం

### పాల్గొన్న మండల నాయకులు



**మూసాపేట, డిసెంబరు 10 ప్రభాతవార్త :** దేవరకద్ర నియోజకవర్గంలో ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ కార్యక్రమంలో ఆదివారం ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డితో కలిసి మూసాపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మండల నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మూసాపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్, మూసాపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కావలి నారాయణ, గడ్డం మహెందర్, అడ్వకేట్ శ్రీనివాస్‌శర్మ, ఎన్. తిరుపతయ్యగౌడ్, బి. గోపాల్, జలగరి లక్ష్మయ్య, కొంగరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



**మిడ్జిల్, డిసెంబరు 10 ప్రభాతవార్త :** షారోన్ యోబు మెమోరియల్ చర్చి మిర్చి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని మిడ్జిల్ జడ్పీహెచ్‌ఎస్ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించారు. మిడ్జిల్ ఎంపిపి సుదర్శన్ స్థానిక సర్పంచ్ రాధిక వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి 400ల మందికి సరైన ట్రీట్మెంట్ నిర్వహించి అవసరమున్న వారికి టుడీకో, ఈసీజీ, ఉచిత మందులు పంపిణీ చేశారు. శిబిరం నిర్వాహకులు రాజారత్నం విజయవంతం చేసినందుకు డాక్టర్లకు సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. పాల్గొన్న డాక్టర్లు యశోద ఆసుపత్రిలో హైదరాబాద్ డాక్టర్ ఆదిత్య శ్రీలత రిషిక తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆభయాంజనేయస్వామి విగ్రహా ప్రతిష్ట...



**వెల్దండ, డిసెంబర్10 ప్రభాతవార్త:**మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామంలో ఆభయాంజనేయస్వామి, శివపార్వతుల, నవగ్రహ గణపతి, సుబ్రహ్మణ్యం, నందీశ్వర నాగదేవత విగ్రహ ప్రతిష్ట పూజలు అంగరంగా వైభవంగా నిర్వహించారు. ప్రతిష్ట పూజా కార్యక్రమాలకు స్టేట్ పుడ్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, సర్పంచ్ అంజినాయక్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గోపాల్‌నాయక్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలు అమలు

### జెడ్పిచైర్ పర్సన్ సరితమ్మకు అభినందనలు తెలిపిన నీలిపల్లి గ్రామ మహిళలు



**గద్వాల ప్రతినిధి డిసెంబర్ 10 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే 6 గ్యారంటీ పథకాలలో మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తెల్లరేషన్ కార్డు కలిగిన కలిగిన ప్రతి కుటుంబానికి రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద 10 లక్షల వైద్య సేవలు అందించే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేసిన సందర్భంగా గద్వాల పట్టణంలోని జెడ్పిచైర్‌పర్సన్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ సరితమ్మకు మల్దకల్ మండల పరిధిలోని నీలిపల్లి గ్రామానికి చెందిన మహిళలు పుష్పగుచ్చాం ఇచ్చి సరితమ్మకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు.

## మంత్రికి అభినందనలు తెలిపిన మాజీ ఎంపి మంద



**ఇటిక్యాల,డిసెంబరు 10 ప్రభాతవార్త :** రాష్ట్ర తెలంగాణ సచివాలయంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖా మంత్రిగా జూపల్లి కృష్ణారావు సచివాలయంలోని తన ఛాంబర్‌లో పదవి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపి మంద జగన్నాథం, మంత్రి జూపల్లి ఛాంబర్‌లో ఆయనను కలిసి అభినందనలు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఉమ్మడి పాలమూరు జిల్లాను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని మంత్రిని కోరారు.

## కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీకి తరలివెళ్లిన లింగాల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు



**లింగాల,డిసెంబరు 10 ప్రభాతవార్త :** అచ్చంపేటలో జరిగే విజయోత్సవ ర్యాలీకి కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్య క్షులు పూజరి వెంకటయ్య, యూత్ కాంగ్రెస్ అధ్య క్షులు శ్రీనివాస్ రాథోడ్ ఆధ్వర్యంలో ఆదివారం పార్టీ శ్రేణులతో తరలివెళ్లారు. ఈ సందర్భంగా అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ అత్యధిక మెజార్టీతో గెలుపొంది, మొదటిసారిగా అచ్చంపేట నియోజకవ ర్గంలో అడుగు పెట్టిన సందర్భంగా లింగాల మండలం లోని ఆయా గ్రామాల పార్టీ శ్రేణులు అచ్చంపేటలోని భారీ ర్యాలీ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు.

## పుట్టుచీర కార్యక్రమానికి హాజరైన మంత్రి జూపల్లి

**కొల్లాపూర్,డిసెంబరు 10 ప్రభాతవార్త :** కొల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని 15వ వార్డు చౌటబెట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు వంగ రాజశేఖర్‌గౌడ్ ఆహ్వానం మేరకు దేవరకద్ర మండలం హాజిలపూర్ గ్రామంలో తన సోదరి ప్రశాంతి రాజేందర్‌గౌడ్‌ల కుమార్తెలు సమీక్ష, శ్రీనితిల పుట్టుచీర కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డా. పగిడాల శ్రీనివాస్, పెద్ద కొత్తపల్లి ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా గౌడసంఘం అధ్యక్షులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



## ద్విచక్రవాహనం వెనుక నుంచి ఎద్దుని ఢీకొని వ్యక్తి మృతి



**లింగాల,డిసెంబరు 10 ప్రభాతవార్త :** వెనుక నుంచి వెళుతూ ఎద్దుని ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని అవుసలికుంట గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అవుసలికుంట గ్రామానికి చెందిన వడ్ల మధు (36) అనే వ్యక్తి ఆదివారం సంత ముగించుకుని తిరిగి లింగాల నుంచి స్వగ్రామమైన అవుసలికుంట వెళుతుండగా అదే గ్రామానికి చెందిన ఓ రైతు వ్యవసాయ పనులు ముగించుకుని ఎద్దులపై కాడి వేసుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో వెనక నుంచి ఎద్దుని ఢీకొట్టాడు. దీంతో రోడ్డుపై బలంగా పడడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య అరుణ, ఒక కుమారుడు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు.

## 17,18న ఛలో ఢిల్లీ



**ఇటిక్యాల,డిసెంబరు 10 ప్రభాతవార్త:** మాదిగలకు ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎస్సీ కార్పోరేషన్ ఛైర్మన్ డా.పిడమర్తి రవి ఆధ్వర్యంలో ఢిల్లీలో ఈనెల 17,19వ తేదీలలో చేపట్టే ఛలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని మాదిగ జేఏసీ జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు సలిక పోగురాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో తెలంగాణలో జరిగిన ఎన్నికల్లో ప్రధానమంత్రి నరెంద్రమోడీ మాదిగలకు ఎస్సీ వర్గీకరణ కోసం చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చారని అలాగే పది సంవత్సరాల క్రితమే వంద రోజుల్లోనే మాదిగలకు ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చాని కాని 10 సంవత్సరాలు అవుతున్న మాదిగలను మోసం చేస్తున్నారని ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాలలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ 17,18 తేదీలలో చేపట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమానికి జోలమ్మ గద్వాల జిల్లా నుండి పెద్ద ఎత్తున మాదిగలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## మహబూబ్‌నగర్ అభివృద్ధికి చేయూతనివ్వండి..

**- మంత్రి జూపల్లికి ఎమ్మెల్యే యెన్నం శుభాకాంక్షలు**



**మహబూబ్‌నగర్‌బ్యూరో,డిసెంబర్ 10, ప్రభాతవార్త:** కొల్లాపూర్ ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావుకు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.ఎక్సైజ్‌శాఖతోపాటు టూరిజం శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి చేయూతనివ్వాలని మంత్రిని కోరారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరును రాష్ట్రంలోనే నెంబర్ స్థానంలో నిలిపేందుకు అందరం కలిసి కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

## రౌడీయిజంపై కఠినంగా వ్యవహరిస్తాం..

**- స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకోవచ్చు**
**- రాజకీయాలకు అతీతంగా క్యాంప్ కార్యాలయం పని చేస్తుంది..**
**- క్యాంప్ కార్యాలయం ప్రారంభంలో ఎమ్మెల్యే యెన్నం..**



**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్ 10, ప్రభాతవార్త:** వ్యాపారుస్తులంతా స్వేచ్ఛగా వ్యాపారం చేసుకోవచ్చని,రౌడీయిజం చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీల తోపాటు తాను వ్యక్తిగతంగా ఇచ్చిన స్వేచ్ఛా, స్వాతంత్ర్యం తూచా తప్పకుండా అమలు చేస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరంగా కృషి చేస్తానని, ప్రజల ఆశలకు, ఆశయాలకు అనుగుణంగా సేవకుడిలా పని చేస్తానని పేర్కొన్నారు. ఏ రాజకీయ పార్టీలకు చెందిన వారైనా పార్టీలకతీతంగా స్వేచ్ఛగా తమ పనులు, వ్యాపారాలు చేసుకోవచ్చని తెలిపారు. రాబోయే రోజుల్లోచట్టం కఠినంగా అమలు కాబోతుందని, సమస్యలు సృష్టించే వారిపై నిఘా ఉంచుతామని గత పాలకుల లాగా కక్ష సాధింపు చర్యలు ఉండవని స్పష్టం చేశారు. మొన్నటివరకే రాజకీయాలని, ఇక మీద నియోజకవర్గ అభివృద్ధే నినాదంతో అందరం కలిసికట్టుగా పని చేసి మహబూబ్‌నగర్‌ను ఐకాన్ గా మార్చుకుందామని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. క్యాంప్ కార్యాలయం ఈక్షణం నుంచి ప్రజా సమస్యల పరిష్కార క్షేత్రంగా ఆవిష్కృతం కానున్నదని చెప్పారు. కార్యాక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు పెద్ద విజయ్‌కుమార్, నాయకులు బెక్కరి మధుసూదన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు వసంత, బెక్కరి అనిత, సాయిబాబా, శ్రీరాములు, సిరాజ్‌ఖాద్రి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రాధాఅమర్, టీజీవో మాజీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# పేదలకు వరం మహాలక్ష్మి పథకం..!

**ఆరోగ్యశ్రీ తో పేదల ఆరోగ్యానికి భరోసా**
**జడ్చర్లలో మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి**
**కొత్త బస్టాండ్‌లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి శ్రీకారం**



ఉచిత బస్ టికెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 10 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం పేదలకు వరం లాంటిదని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం, మహాలక్ష్మి పథకాలను ఆదివారం జడ్చర్లలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా జడ్చర్ల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు చెందిన ప్రజలు రాష్ట్రంలోని నిమ్స్, గ్లోబల్, యశోదా మల్టీ స్పెషాలిటీ లాంటి ఆసుపత్రులలో నాణ్యమైన చికిత్స పొందేందుకు 10 లక్షల ఆరోగ్య భీమా పథకం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రాష్ట్రంలో ఎన్నో నిరుపేద కుటుంబాలకు లబ్ది చేకూరుతుందని అన్నారు.

**మహాలక్ష్మి పథకం ప్రారంభం...**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళలకు ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని జడ్చర్ల కేంద్రంలో కొత్త బస్టాండ్‌లో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా డిఎంతో కలిసి అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బస్టాండ్ ఆవరణలో మహిళలతో కలిసి బస్సులో ప్రయాణించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం ఆర్టీసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించిందని తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు అందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

# అరుదైన మొక్కలకు నిలయం తెలంగాణ బొటానికల్ గార్డెన్..

**టిబిజీని సందర్శించిన డా. రాసింగం**

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 10 ప్రభాతవార్త :** జడ్చర్లలోని డా. బూర్గుల రామకృష్ణరావు ప్రభుత్వ డిగ్రీ అండ్ పిజి కళాశాలలో అభివృద్ధి చేస్తున్న తెలంగాణ బొటానికల్ గార్డెన్‌ను బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా, డెక్కన్ రీజినల్ సెంటర్, హైదరాబాద్ డిప్యూటి డైరెక్టర్ డా. లడాన్ రాసింగం ఆదివారం సందర్శించారు. వీరికి గార్డెన్ సమన్వయకర్త డా.బి. సదాశివయ్య, వృక్షశాస్త్ర విభాగాధిపతి శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఘన స్వాగతం పలికారు. కేంద్ర ప్రభుత్వం బొటానికల్ గార్డెన్స్‌కు అందించే సహాయానికి తెలంగాణ బొటానికల్ గార్డెన్‌ను ఎంపిక చేయాలా వద్దా అనే సాధ్యాసాధ్యాల గురించి అధ్యయనం చేయడానికి వచ్చానని డా. రాసింగం తెలిపారు. గార్డెన్‌లో ఉన్న సదుపాయాల గురించి ఆరా తీశారు. భవిష్యత్‌లో అంతరించి పోతున్న ఈ మొక్కల పెంపకానికి ఈ గార్డెన్ అనుకూలంగా ఉందని తెలియజేశారు. గార్డెన్‌లో పెంచుతున్న అరుదైన మొక్కలు ఔషధ మొక్కల అభివృద్ధి చూసి అభినందించారు. ముఖ్యంగా గార్డెన్ అభవృద్ధిలో విద్యార్థుల పాత్ర అమోఘమని కొనియాడారు. తాను కేంద్ర ప్రభుత్వ పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖకు అందించే నివేదిక సానుకూలంగా ఉంటుందన్నారు. కళాశాలలో ఉన్న తెలంగాణ స్టేట్ హెర్బరియం, బయోడైవర్సిటీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ సెంటర్, కొత్త కేశవులు నెట్ హౌస్ అద్భుతంగా ఉన్నాయన్నారు. వీటి అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల గురించి తెలుసుకుని ఆనందం వెలిబుచ్చారు. ఈ అభివృద్ధి ఇలాగే ఉంటే కేంద్ర ప్రభుత్వ సహాయం అందే అవకాశం ఉందన్నారు. ఈ గార్డెన్ అభివృద్ధిలో విద్యార్థులు మూలస్థంభం అని మెచ్చుకున్నారు. ప్రిన్సిపాల్, అధ్యాపకుల సహకారం చాలా బాగుందని అన్నారు. అనంతరం గార్డెన్‌లో మొక్కనాటి నీళ్ల పోశారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసులు, సదాశివయ్య, ఎన్ఎస్ఎస్ యూనిట్ 3కు చెందిన 20 మంది వాలంటీర్‌లు, పరిశోధక విద్యార్థిని రమాదేవిలు పాల్గొన్నారు.



మొక్కలను పరిశీలిస్తున్న బృందం



బొటానికల్ గార్డెన్ సందర్శిస్తున్న డా. రాసింగం

# రూ.10లక్షలతో ఉచిత ఆరోగ్యశ్రీ భీమా సదుపాయం..

**మహాలక్ష్మి ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించిన అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు**



అలంపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో 10 లక్షలు ఆరోగ్య శ్రీ భీమా పోస్టర్‌ను విడుదల చేస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే




మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రాణాన్ని జెండాఊపి ప్రారంభించిన అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

**ఇటిక్యాల,డిసెంబరు 10 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజలకు ప్రవేశపెట్టిన 10 లక్షల రూపాయలతో ఉచిత ఆరోగ్యశ్రీ భీమా పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అలాగే మహాలక్ష్మి పథకం కింద ఉచితంగా మహిళలకు బస్సుల్లో ప్రయాణం కల్పించడం జరిగిందని ఈ పథకాలను ప్రతి ఒక్కరు పొందాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ప్రజలకు వివరించారు. ఆదివారం అలంపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే విజయుడు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో అలాగే ప్రభుత్వం గుర్తించిన కార్పోరేట్ ఆసుపత్రులలో 10 లక్షల రూపాయల విలువగల ఉచితంగా ఆరోగ్యశ్రీ సేవలు అందస్తారని ఈ పథకం వల్ల పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అదేవిధంగా మహాలక్ష్మి పథకం కింద తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసి పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులలో ఉచితంగా మహిళలు ప్రయాణించవచ్చని ఈ పథకాన్ని ప్రతి ఒక్క మహిళ వయసుతో సంబంధం లేకుండా ప్రయాణించవచ్చని అన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీకి సంబంధించిన పోస్టర్లు విడుదల చేసి అలాగే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని జెండాఊపి ప్రారంభించారు. ఇదే సందర్భంగా మహిళలతో కలిసి బస్సులో ఎమ్మెల్యే విజయుడు ప్రయాణించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ మనోరమ, జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి ముసాయిదాబేగం, జిల్లా వైద్యాధికారి డా. శశికళ, ఆసుపత్రి డాక్టర్లు, ప్రోగ్రాం అధికారులు, జోగులాంబ ఆలయ ఛైర్మన్ చిన్నకృష్ణనాయుడు, ఎంపిపి కోట్ల అశోక్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## నాయినిపల్లి మైసమ్మను దర్శించుకున్న మంత్రి జూపల్లి..

**కొల్లాపూర్,డిసెంబరు 10 ప్రభాతవార్త :** ప్రజల ఆరాధ్యదైవం అయిన నాయినిపల్లి మైసమ్మ తల్లి సన్నిధిలో తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం తమ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మైసమ్మ తల్లిని దర్శించుకున్నారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలందరూ సుఖ, సంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. మైసమ్మ తల్లి దర్శనానికి ఇతర ప్రాంతాల ఉంచి భక్తులు వస్తుంటారని విశేష భక్తులను కలిగిన మహిమగల తల్లి నాయినోని పల్లి మైసమ్మ ఆలయ అభివృద్ధికి మరింతగా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మైసమ్మ ట్రస్టు ఛైర్మన్ శ్రీనివాస్ యాదవ్, పెద్దకొత్త పల్లి మండల ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్, జడ్పీటిసి మేకల గౌరమ్మ చంద్రయ్య, ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



మైసమ్మ తల్లిని దర్శించుకుంటున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

## రోడ్డు భవనాల శాఖ మంత్రిగా కోమటిరెడ్డి ప్రమాణస్వీకారం..

**- పాల్గొన్న జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి**



మంత్రి కోమటిరెడ్డితో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్ 10, ప్రభాతవార్త:** నూతనంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రిగా కోమటరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదివారం సచివాలయంలో ఆయన కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం కార్యాలయంలో తన చాంబర్‌లో కోమటిరెడ్డిని ఎమ్మెల్యే యెన్నం మర్యాద పూర్వకంగా కలిశారు. జడ్చర్ల అభివృద్ధికి పూర్తి సహకారం అందించాలని మంత్రిని కోరారు. ఆయనతోపాటు కార్యక్రమంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా ఉన్నారు. ఈ సందర్భంగా జడ్చర్లకు చెందిన కాంగ్రెస్ యువజన నాయకులు వంశీచంద్‌రెడ్డి, తుంగ రఘు తదితరులు మంత్రి కోమిటిరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపి బొకే అందజేశారు.

## కురుమూర్తి కొండకు పోటెత్తిన భక్తజనం..!

**గోవింద నామస్మరణతో పులకరించిన కాంచన గుహ**
**యాత్రికులతో సందడిగా మారిన జాతర మైదానం**



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

**చిన్నచింతకుంట,డిసెంబరు 10 ప్రభాతవార్త :** పల్లె జనుల ఆరాధ్యదైవం, పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తిస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు కావడంతో పట్టణ ప్రాంతాల నుంచే కాకుండా పల్లె ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తజనంతో కురుమూర్తి కొండ కిటకిటలాడింది. కొండ దిగువ నుంచి స్వామివారి సన్నిధి వరకు ప్రధాన మెట్ల మార్గాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. భక్తుల గోవింద నామస్మరణతో స్వామివారి ప్రధానాలయం మారుమ్రోగింది. క్యూ లైన్‌లలో బారులు తీరిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

**యాత్రికులతో సందడిగా మారిన జాతర మైదానం...**

శ్రీ కురుమూర్తి స్వామి జాతరకు తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకున్న అనంతరం జాతర మైదానంలోని వ్యాపార సముదాయాలు యాత్రికులతో సందడిగా మారాయి. మిఠాయి దుకాణాలు, మహిళల ఫ్యాన్సీ దుకాణాలు, మట్టి గాజుల దుకాణాలు, యువతకు ఉల్లాసాన్నిచ్చే రంగులరాట్నం వద్ద యాత్రికులు రద్దీ కనిపించింది. యాత్రికుల కొనుగోళ్లతో వ్యాపార సముదాయాలు సందడిగా మారాయి.



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



కురుమూర్తి జాతరలో భక్తుల కోలాహలం



కురుమూర్తి జాతరలో భక్తుల కోలాహలం



దామోదర్ రాజనర్సింహాకు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ శ్రేణులు

## శివంపేటలో మంత్రి దామోదర్‌కు ఘన స్వాగతం

**చౌటకూరు, డిసెంబరు 10, ప్రభాతవార్త:** వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా తొలిసారి మండలానికి చేరుకున్న దామోదర్ రాజనర్సింహాను కాంగ్రెస్ నాయకులు శివంపేటలో ఘనస్వాగతం పలికారు. జోగిపేటలో మహిళలకు ఉచిత బస్సు కార్యక్రమాన్ని ప్రారంభించడానికివెళుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహాను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నత్తి దశరత్ ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలువేసి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో సుల్తాన్‌పూర్ మాజీ ఎంపిటిసి సభ్యులు ఈశ్వర్‌గౌడ్, శివపేట ఎంపిటిసి సభ్యులు కిరణ్‌గౌడ్, బిసిసెల్ మండల అధ్యక్షులు, కో-ఆపరేటివ్ డైరెక్టర్ నాగమల్లేశం, మైనార్టీ సెల్ మండల ఉపాధ్యక్షులు యండి జావీద్, విశ్వకర్మ మండల అధ్యక్షులు కమ్మరి అశోక్, రజక సంఘం మండల అధ్యక్షులు సిహెచ్ అశోక్, శివంపేట గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఎల్‌ఎస్ రాజు, శివంపేట కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, వెండికోల్ మాజీ సర్పంచ్ మల్లేశం కోర్పోల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు మురళీధర్‌రెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

## వన భోజనాలతో ఐక్యత భావం మెరుగు : ఎమ్మెల్యే



ఎమ్మెల్యే ప్రభాకర్‌ను సన్మానిస్తున్న లింగాయత్ సమాజ్ బాధ్యులు

**సంగారెడ్డి టౌన్, డిసెంబరు 10, ప్రభాతవార్త:** వనభోజనాలతో ప్రజల్లో ఐక్యతభావం పెరిగే అవకాశాలు ఉంటాయని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. ఆదివారం మండలంలోని కలబ్‌గూర్ మంజీరా డ్యామ్ శివాలయం లో వీరశైవ లింగాయత్ ఆధ్వర్యంలో వన భోజనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను లింగాయత్‌లు సాదరంగా ఆహ్వానించి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ లింగాయత్‌లకు అందుబాటులో ఉంటా సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వరప్ప, జిల్లా కార్యదర్శి మల్లికార్జున్ పాటిల్, శివకుమార్, రాజు, ధనుంజయ్, రాజేశ్వర్ స్వామి, సిడిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, శ్రీదర్‌రెడ్డి, కొత్తపల్లి శ్రీకాంత్, శ్రావణ్‌రెడ్డి చక్రపాణి, వాజిద్, వీరశైవ లింగాయత్ సభ్యులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలను అమలుచేయడం ఖాయం



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సంతోష్‌గుప్త

**శివ్వంపేట, డిసెంబర్10 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగించడం సంతోషకరమని ఆ పార్టీ రాష్ట్ర నేత ఉప్పల సంతోష్‌కుమార్‌గుప్త అన్నారు. ఆదివారం శివ్వంపేటకు వచ్చిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధిష్టాన వర్గం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేవడం ఖాయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మహాలక్ష్మి పేరుతో ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని, ఆరోగ్య శ్రీ పథకం 10 లక్షలకు పెంపు పథకాలను ప్రారంభించడం గొప్ప విషయమన్నారు. మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి అనే నినాదం ప్రజానికంలో నిండుగా ఉందని, వారందరూ కలిసి అధికారాన్ని కాంగ్రెస్ పార్టీకి అప్పగించారని సంతోష్‌గుప్త అన్నారు. ఇందిరా గాంధీ రాజ్యం కావాలన్నదే ప్రజల ఆకాంక్ష వల్లే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రజల కోసం సోనియమ్మ ఆరు గ్యారెంటీలను ఇచ్చిందన్న విషయాన్ని అందరూ గమనించాలన్నారు.

## ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు : ఎమ్మెల్యే



మిషన్ భగీరథ కనెక్షన్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**అమీన్‌పూర్, డిసెంబర్ 10 ప్రభాతవార్త:** ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించడం లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని 17వ వార్డు ప్రణీత్ పనోరమ కాలనీలో మిషన్ భగీరథ కనెక్షన్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ప్రతి ఇంటికి మంచినీరు అందించాలన్న లక్ష్యంగా 100 కోట్ల రూపాయలతో ఇప్పటికే ఐదు రిజర్వాయర్లను నిర్మించడం జరిగిందని తెలిపారు. ప్రణాళిక బద్ధంగా పనులు పూర్తిచేస్తూ మంచినీటిని అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నరసింహాగౌడ్, వార్డు కౌన్సిలర్లు చంద్రకళ గోపాల్, కృష్ణ, సర్పంచి కృష్ణ, సీనియర్ నాయకులు శ్రీకాంత్ ముదిరాజ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 13న నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం

**పటాన్‌చెరు, నవంబర్ 10, ప్రభాతవార్త:** ఈ నెల 13న పటాన్‌చెరు నియోజకవర్గ స్థాయి అభివృద్ధి సమీక్షా సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణం లోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని స్థాయిల ప్రజా ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి నుండి చేపడుతున్న పనుల పురోగతి నూతనంగా చేపట్టబోయే అభివృద్ధి పనుల రూపకల్పనలపై అన్ని విభాగాల అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేస్తూ ముందుకు వెళ్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి

# 'మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్యశ్రీ'ని సద్వినియోగం చేసుకోవాలి

### బిఆర్ఎస్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

**జహీరాబాద్, డిసెంబరు 10, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పించడం హర్షణీయమని, ఇలాంటి పథకాలు అమలు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్టీసి ఆధ్వర్యంలో ఆర్టీసి, వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాటు చేసిన మహిళలకు ఉచిత బస్ సౌకర్యం, ఆరోగ్యశ్రీ పథకం ప్రారంభోత్సవ సమావేశాల్లో ఎమ్మెల్యే ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆర్టీసి అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు మహాలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో గతంలో రూ. 5 లక్షల వరకు వైద్య సేవలు అందుకునే అవకాశం ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వం 10 లక్షలవరకు వైద్యం అందుకునే అవకాశాన్ని కల్పించిందన్నారు. ప్రజలు ఆరోగ్యశ్రీ పథకంలో వైద్యచికిత్సలు అందుకునేందుకు ప్రభుత్వం అనుమతి పొంది ఆసుపత్రుల వివరాలు, వాటి ఫోన్ నంబర్లను ప్రజలకు అందుబాటులో ఉండేలా వైద్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని



మహిళలకు ఉచిత బస్ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఎమ్మెల్యే ఆదేశించారు.

**ఎంపి, ఎమ్మెల్యేల ఫొటోలు లేవని బిఆర్ఎస్ నేతల రగడ...**

ఆదివారం పట్టణంలో మహాలక్ష్మి,రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాల ప్రారంభోత్సవ సభలను పురస్కరించుకుని ఏర్పాటుచేసిన బ్యానర్‌లో ఎంపి బిబి పాటిల్, ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఫొటోలు లేకపోవడంతో బిఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాశానికి ఆహ్వానించి బ్యానర్‌లో ఎమ్మెల్యే ఫోటో లేకుండా చేయడం దళిత ఎమ్మెల్యేను అవమానించడమే అని నాయకులు అధికారుల ముందు నిరసన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ నేతల ఆగ్రహాన్న గ్రహించిన అధికారులు అప్పటికి అప్పుడు ఎంపి బిబి పాటిల్, ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఫోటోల తెప్పించి బ్యానర్‌పై అంటించడంతో నాయకులు తమ గొడవను సద్దుమణిగించారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, జిఆల్ల ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్ శంకర్, ఏరియా ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ శ్రీదర్, ఆర్టీసి డిపో మేనేజర్ వెంకటనారాయణ, తహసీల్దార్ ఎస్ రవీందర్, ఎంపిడిఓ పి సుమతి, సొసైటీ చైర్మన్ స్రవంతి అవరింద్‌రెడ్డి, ప్రభుత్వ వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బస్సు నడుపుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

## మహాలక్ష్మీ పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**పటాన్‌చెరు, నవంబర్ 10,ప్రభాతవార్త:** మహిళల కోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని ఆదివారం పటాన్‌చెరులో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మంచిచేసే పథకాలకు సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, డిఆర్ డిఏపిడి శ్రీనివాసరావు, ఆసుపత్రి ముఖ్య అధికారి వసుంధర, ఎంపీపీలు సుష్మాశ్రీ, వేణుగోపాల్‌రెడ్డి ప్రవీణవిజయభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీలు సుధాకర్ రెడ్డి, కుమార్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్లు తుమ్మల పాండురంగారెడ్డి, రోజా బాల్‌రెడ్డి, లలితా సోమిరెడ్డి, వైస్ చైర్మన్లు నరసింహాగౌడ్, రాములుగౌడ్, కార్పోరేటర్లు సింధు,ఆదర్శ్‌రెడ్డి, మెట్టు కుమార్ యాదవ్, పుష్ప నగేష్; వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్ గౌడ్; సీనియర్ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలి

### ఎంపిటిసిల రాష్ట్ర నాయకుడు దేవి రవీందర్

**కొండపాక, డిసెంబర్ 10, ప్రభాతవార్త :** సిఎంఆర్ఎఫ్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించి నిరుపేదలకు అండగా నిలువాలని ఎంపిటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ రాష్ట్ర ప్రభుత్వనికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన లకుడారంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రిలో ఖరీధైన వైద్యం చేయించుకున్న వారిని అదుకోవడానికి గత బిఆర్ఎస్ ప్రభుత్వం సిఎంఆర్ఎఫ్ దా ్వరా ఆర్థిక సహాయం అందించిందని గుర్తు చేశారు. అనంతరం కుకునూరుపల్లి మండల పరిధిలోని లకుడారం గ్రామానికి చెందిన ఎం డి. దస్తగిరికి రూ॥ 22 వేల, నాగపూరి యాదయ్యకు రూ॥ 22 వేల విలువ గల సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ॥ 10 లక్షలకు పెంచడం నిరుపేదలకు మేలు చేయడమేనని ఆయన అన్నారు. ప్రభుత్వం ప్రజలకు మంచి చేస్తె హర్షిస్తామని, ప్రజల పక్షాన నిలబడి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

## ఆరోగ్యశ్రీని రోగులు సద్వినియోగం చేసుకోవాలి : తహసీల్దార్




మాట్లాడుతున్న తహసీల్దార్ రవీందర్‌రెడ్డి

**హుస్నాబాద్, డిసెంబరు 10, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్యశ్రీని రోగులు సద్వినియోగం చేసుకోవాలని హుస్నాబాద్ తహశీల్దార్ రవిందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రోజున పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి సూపరింటెంట్ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్యశ్రీ పథకం ఆర్థిక పరిమితి రూ10లక్షలకు పెంపు పథకాన్ని కాంగ్రెస్ నాయకులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదు లక్షల పరిమితి ఉన్న ఆరోగ్యశ్రీని 10లక్షలకు ప్రభుత్వం పెంచిందన్నారు. నూతన ఆరోగ్యశ్రీలు, రేషన్ కార్డు ప్రక్రియ ఇంకా మొదలు కాలేదని,ప్రభుత్వం నుండి ఆదేశాలే రాగానే సమాచారం అందిస్తామన్నారు. ఆరోగ్యశ్రీలో అనుసంధానమైన ఆసుపత్రులలో మాత్రమే వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డిఎంహెచ్‌వో డాక్టర్ ప్రభాకర్, టిపిసిసి సభ్యులు కేడం లింగమూర్తి,సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్యతో పాటు వైద్య సిబ్బంది శబ్దప్రకాష్, కనకయ్య, రమేష్, కోటి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని పరామర్శించిన ఎంపిపి

**మర్కుక్, డిసెంబర్ 10 (ప్రభాతవార్త):** ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరు వ్యక్తులను ఆదివారం ఎంపిపి పాండుగౌడ్ పరామర్శించారు. మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన పోచి కనకయ్య, బొడ్డు సంతోష్‌లు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ సందర్భంగా ఇరు కుటుంబాలను స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలిసి ఎంపిపి పాండుగౌడ్ పరామర్శించి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఆయనతో పాటు నాయకులు బొడ్డు స్వామి, నర్సింలు, శ్రీకాంత్, భూపాల్, కనకయ్య, శ్రీశైలం తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న పచ్చిమట్ల రవీందర్‌గౌడ్

## పంచాయతీ ఎన్నికల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కేటాయించాలి

### -బిసి సంక్షేమ సంఘ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్

**హుస్నాబాద్, డిసెంబరు 10, ప్రభాతవార్త :** పంచాయతీ ఎన్నికల్లో బిసిలకు 50శాతం రిజర్వేషన్లు కేటాయించాలని బిసి సంక్షేమ సంఘం కన్వీనర్ పచ్చిమట్ల రవిందర్‌గౌడ్ డిమాండ్‌చేశారు. ఆదివారం బిసి సంక్షేమ సంఘం, రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ హుస్నాబాద్ శాసనసభ్యులుగా భారీ మెజారిటీతో గెలుపొంది బిసి సంక్షేమశాఖ,రవాణాశాఖ మంత్రిగా ఎన్నికైన పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ రాష్ట్రంలో రాజకీయంగా బిసిలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈసారి అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోబోమన్నారు. అలాగే హుస్నాబాద్‌లో బిసి హాలు ఏర్పాటు చేయడంతోపాటు బిసి కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేసి రుణాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు వెల్దండి సంతోష్,ప్రధాన కార్యదర్శి వరియోగుల అనంతస్వామి, నాయకులు చారి,శంకర్ పాల్గొన్నారు.

## ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న టీపీసీసీ కార్యదర్శి



ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న టీపీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి

**వెల్దుర్తి, డిసెంబర్ 10 ప్రభాతవార్త:** మాసాయిపేట మండల పరిధిలోని రామాంతాపూర్ గ్రామంలోని దర్గా వద్ద శనివారం రాత్రి ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి పాల్గొని దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లిం మత పెద్దలను కలిసి ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వారు రాజిరెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కరాటే, కుంగ్‌ఫూ పోటీలో విద్యార్థినుల ప్రతిభ

**చిన్నశంకరంపేట, నవంబర్ 10,ప్రభాతవార్త:** కరాటే, కుంగ్‌ఫూలో చిన్న శంకరంపేట మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిణీల అత్యుత్తమ ప్రతిభ కనభరిచారు. ఆదివారం భాగ్యనగరంలోని రాష్ట్ర స్థాయిలో నిర్వ హించిన కరాటే, కుంగ్‌ఫూలో ప్రథమ, ద్వితియ,తృతియ స్థానాల్లో పాఠశాల విద్యార్థినిలు గెలుపొందారని, ప్రధానోపాధ్యాయులు పుష్పవేణి తెలిపారు. విజేతలుగా నిలిచిన అంజలిపాండే, ప్రసన్న, రేణుకలను కరాటే ఉపాధ్యాయుడు కిషన్ స్వామిని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు అభినందించారు.

## ఆర్టీసీలోనే సురక్షిత ప్రయాణం : ఆర్డీవో

**హుస్నాబాద్, డిసెంబరు 10,ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వార చేపట్టిన ఉచిత ఆర్టీసి ప్రయాణాన్ని ఆదివారం రోజున హుస్నాబాద్ ఆర్డీవో బెన్‌షాలోమ్ డిపో మేనేజరు వెంకటేశ్వర్లుతో కలసి జెండా ఊపి ప్రారంబించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజు ప్రయాణం చేసే విద్యార్థినిలు,కూరగాయలు అమ్మే మహిళలు,ఉద్యోగ రీత్య వెల్లే మహిళలకు ఈ ఉచిత ప్రయాణం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆర్టీసి బస్సులలోనే సురక్షిత ప్రయాణం సాగిస్తూ సుఖంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి మెంబర్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.



ఉచిత బస్సు సౌకర్యాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీవో బెన్‌షాలోమ్

# శివనామ స్మరణతో మార్మోగిన శ్రీభవాని చిదంబరస్వామి శివాలయం

**మెదక్ అర్బన్, డిసెంబర్ 10 ప్రభాతవార్త:** ఓం నమఃశివాయ.. హర హర మహాదేవ.. శంభో శంకర.. హరోం హర.. అనే శివ నామ స్మరణతో శ్రీ భవానీ చిదంబర స్వామి శివాలయం మారుమ్రోగింది. పవిత్ర కార్తీక మాసం పురస్కరించుకొని శ్రీకోదండ రామాలయంలోని శ్రీభవానీ చిందంబర స్వామి శివాలయంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వేకువ జాము నుంచే వేడుకలు ప్రారంభం కావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అర్చకులు అమ్మన్నగారి కృష్ణశర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, సుప్రభాత సేవ, పుణ్యహవచనం, అంకురార్పణ, అఖండ దీపారాధన, మహాన్యాసం తదితర విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 50 మంది వేద పండితులచే మహా రుద్రాభిషేకం ఘనంగా ప్రారంభమైంది. శాస్త్రోక్తంగా ఉదయం నుండి



శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

సాయంత్రం వరకు 600 సార్లు మహా రుద్రాభిషేకాలు చేపట్టారు. ప్రత్యేక అలంకరణలో పరమ శివుడు భక్తులకు దర్శనమిచ్చాడు. రాత్రి నక్షత్ర హారతి తొలిరోజు ఉత్సవాలు వైభవంగా జరిగాయి. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రెండవ సోమవారం తెల్లవారు జామున నుంచి సాయంత్రం ప్రత్యేక పూజాకార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఈ కార్యక్రమంలో శాస్త్రుల రామకృష్ణ శర్మ, దేశాయిపేట అంకుశ్‌శర్మ, కరణం పవన్ కుమార్‌శర్మ, అభిలాష్‌శర్మ, శ్రీభాస్యం మధుసూదనాచార్యులు, కులకర్ణి పవన దత్తసాయిశర్మ, దేశాయిపేట లింగమూర్తి శర్మ, వైద్య శ్రీనివాస్ శర్మ, సోమశేఖరరావు, హర్షవర్దన్ శర్మ, శ్రీవాండ్ల శ్రీనివాస్ శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ బండ నరేందర్ సభ్యులు నందని శ్రీనివాస్, బద్రినాత్, నంగరం మల్లేశం, భక్తులు పాల్గొన్నారు.



మహాలక్ష్మి ఉచిత ప్రయాణపథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## మహాలక్ష్మి ఉచిత ప్రయాణ పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, డిసెంబర్ 10ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రయాణన్ని ఎమ్మెల్యే డాక్టరు పట్లోళ్ల సంజీవరెడ్డి జెండాఊపి రాజీవ్‌చౌక్ వద్ద బస్సును ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన రాష్ట్రంలో ఆరు గ్యారంటీల్లో భాగమైన ఒకటి మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణాన్ని మెనిఫేస్టోలో పెట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా మహిళలు బసులో ఉచితంగా ప్రయాణం చేయవచ్చని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పి.సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ ఆనంద్‌స్వరూప్‌శెట్కార్, మున్సిపల్ కౌన్సిలర్లు దారం శంకర్‌సేట్, వివేకానంద,హన్మానండ్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కె.భోజిరెడ్డి, నారాయణఖేడన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాహేర్ అలీ, ఆర్టీసీ డిఎం మల్లేశయ్య,మార్కెటింగ్ సెల్ ఇంఛార్జి పాండు, పాల్గొన్నారు.

**పేదలకు వరం 'రాజీవ్ ఆరోగ్యశ్రీ'...**

**నారాయణఖేడ్, డిసెంబర్ 10 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పేదలకు వరమని ఎమ్మెల్యే డాక్టరు పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం నారాయణఖేడ్ ప్రభుత్వ ఏరియా ఆసుప్రతిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ పథకం పేదలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆరోగ్య శ్రీ పథకంలో ఇక నుంచి ఐదు లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుని వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. కార్యక్రమంలో పి.సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ చాందీబాయి రాంచందర్, మునిస్సపల్ ఫ్లోర్‌లీడర్ ఆనంద్ స్వరూప్ శెట్కార్, ఉప ఫ్లోర్ లీడర్ దారం శంకర్ సేట్, కౌన్సిలర్లు హన్మాండ్లు, వివేకానంద, విఠల్ ఎంపీటీసీ, శంకర్ ముదిరాజ్ సంఘం తాలుకా అధ్యక్షులు, అల్కారి సత్యనారాయణ మాజీ ఎంపీపీ, మండల పార్టీ అధ్యక్షులు తాహేర్ అలీ, స్వప్న శంకరయ్యస్వామి, ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ సంజీవ్‌పటేల్, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది, డాక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**మనూర్, డిసెంబరు 10, ప్రభాతవార్త:** మండలంలోని ఎల్గోయి గ్రామానికి చెందిన లబ్దిదారులకు ఆదివారం మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. గ్రామానికి చెందిన సోను బాయి, వరుణ్‌కుమార్ అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మెరుగైన వైద్య చికిత్సకోసం సోనుబాయికి రూ. 49వేలు, వరుణ్ కుమార్‌కు రూ. 23500 చెక్కును అందించారు. కార్యక్రమంలో లబ్దిదారుల కుటుంబ సభ్యులతోపాటు బిఆర్ఎస్ మండల అధ్యక్షులు విఠల్‌రావుపాటిల్ పాల్గొన్నారు.

## ఏదుల్లాపూర్‌లో కొనసాగుతున్న గ్రామ దేవతల ప్రతిష్ట మహోత్సవాలు



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న సర్పంచి కీర్తన హనుమంత రావు దంపతులు

**శివ్వంపేట, డిసెంబర్ 10 ప్రభాతవార్త:** గ్రామ పరిధిలోని ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ శివ్వంపేట మండలం ఏదుల్లాపూర్ గ్రామంలో మూడు రోజులుగా గ్రామ దేవతలకు పూజలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఎంపీపీ అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ సారథ్యంలో గ్రామస్థులతోపాటు సర్పంచి కల్లూరి కీర్తన హనుమంతరావు సహకారంతో నిర్వహిస్తున్న గ్రామ దేవతల ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా మూడవ రోజు ఆదివారం ప్రత్యేక పూజలు గ్రామం మధ్యలో నిర్వహించి ఊరి పొత్తి వేయడం జరిగింది. ఈ ఊరి పొత్తిలో భాగంగా గ్రామం నుండి ఎవరూ బయటకు వెళ్లకూడదని, ఇతరులు గ్రామంలోని రాకూడదని దేవతల అభీష్టం మేరకు నిర్ణయించడం జరిగింది. మూడు రోజులుగా ఏదుల్లాపూర్ గ్రామంలో గ్రామస్థులతో పాటు బంధువులతో పండుగ వాతావరణంగా కనిపిస్తుంది. ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, సర్పంచి కీర్తన హనుమంతరావులు మాట్లాడుతూ ప్రతిష్టించిన గ్రామ దేవతలతోపాటు దేవుళ్ల ఆశీస్సులతో ప్రజలు, పాడిపంటలు సుభిక్షంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచి కల్లూరి పాండు రంగం, కల్లూరి వెంకటేష్, జైపాల్‌రెడ్డి, సునందరెడ్డి, డాక్టర్ సంతోష్ కుమార్, యాదిరెడ్డి, మర్రి మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కల్లూరి ముత్యాలు పటేల్ ఉన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత

**చిన్నశంకరంపేట, నవంబర్ 10,ప్రభాతవార్త:** మండల పరిధి కొర్విపల్లి గ్రామానికి చెందిన పోచయ్య కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మైనంపల్లి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు మైనంపల్లి హనుమంతరావు రూ.5వేల ఆర్థిక సహాయాన్ని పంపగా ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్తిగల రాంచందర్ వారికి అందించారు. మాజీ సర్పంచి రంగారావు 50 కేజీల బియ్యంను బాధిత కుటుంబానికి ఇచ్చారు. నర్సింలు, బాలమల్లు, జనార్ధన్ పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప పడిపూజ

**చిన్నశంకరంపేట, నవంబర్ 10, ప్రభాతవార్త:** పట్టణ కేంద్రంలో అయ్యప్ప పడిపూజను మాలధార స్వాములు ఘనంగా నిర్వహించారు. పట్టణ కేంద్రానికి చెందిన వెంకట్‌రాంరెడ్డి ఆదివారం శ్రీనివాస గార్డెన్స్‌లో అయ్యప్పస్వామి మహాపడిపూజను నిర్వహించారు. స్వామియే శరణం అయ్యప్ప.. శరణం..శరణం అయ్యప్ప స్వామి శరణం అయ్యప్ప అంటూ అయ్యప్ప స్వామి నామస్మరణ మారుమ్రోగింది. ఈ మహాపడిపూజ మహోత్సవానికి పెద్ద ఎత్తున అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గోని అయ్యప్ప నామస్మరణం, భజన పాటలు, భక్తి గీతాలను ఆలకించారు. గత 18 సంవత్సరాలుగా అయ్యప్ప మాల దరిస్తున్నాని, ప్రతి సంవత్సరం మహా పడిపూజు ఘనంగా నిర్వహిస్తానని వెంకట్‌రాంరెడ్డి తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్లుపల్లి, కామారం, గవ్వలపల్లి, నార్సింగి, చేగుంట మండలాల స్వాముల పెద్ద ఎత్తున పాల్గోన్నారు.

## లక్ష్మీనరసింహస్వామి దేవాలయ పునఃనిర్మాణానికి రూ.1,00,116 విరాళం

**వెల్దుర్తి, డిసెంబర్ 10 ప్రభాతవార్త:** మండల పరిధిలోని హస్తాల్‌పూర్ గ్రామ సమీపాన శ్రీలక్ష్మీనర్సింహస్వామి పురాతన దేవాలయం నెలకొని ఉంది. హస్తాల్‌పూర్ గ్రామస్థులు అట్టి లక్ష్మీనర్సింహ స్వామి దేవాలయాన్ని పున:నిర్మించడానికి దాతలను విరాళాలు కోరడం జరిగిందని గ్రామ మాజీ సర్పంచి పాండు తెలిపారు. ఈ సందర్భంగా దేవాలయ పున:నిర్మాణం కోసం హైదరాబాద్‌కు చెందిన తాళెం కృష్ణమూర్తి, ఇందిరాగుప్త 1,00,116 రూపాయలు ఆదివారం విరాళంగా అందించడం జరిగిందన్నారు. అలాగే వారు గుడి ట్రస్టు మెంబర్‌గా చేరడం జరిగిందన్నారు. అలాగే తాళ్లపల్లి లక్ష్మణ్, లక్ష్మీనందులు 25 వేల రూపాయలు విరాళంగా ఇవ్వడం జరిగిందని తెలిపారు. వీరికి దేవాలయ ట్రస్టు తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి పాండు, ఆలయ కమిటీ ట్రస్టు సభ్యులు పెంటారెడ్డి తదితరులు ఉన్నారు.

## మూడు రోజుల కింద అదృశ్యం..నేడు శవమై...

**నిజాంపేట, డిసెంబర్ 10, ప్రభాతవార్త :** మండల కేంద్రానికి చెందిన కుమ్మరి రాజు(30) మూడు రోజుల క్రితం అదృశ్యమై ఆదివారం గడిం చెరువులో శవమై తేలాడు. ఈ మేరకు పోలీసుల కథనం ప్రకారం.. రాజుకు కొన్ని రోజులుగా మానసికస్థితి సరిగాలేదని, మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని మృతుని తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తుండగానే ఆదివారం శవమైతేలాడని తెలిపారు. గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి పంచనామ నిర్వహించి కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.